Namasthe Telangana DT 06/12/17.

# మెట్రోరైలు సక్సెస్ నుంచి సివిల్ సర్వెంట్స్ స్ఫూర్తి పొందాలి

**-ఎంసీహెచ్ఆర్‌డీ డీజీ టీపీ ఆచార్య**

**-ఆరో ఏడాది నుంచి మెట్రోకు లాభాలే : ఎన్వీఎస్ రెడ్డి**



సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు విజయాన్ని సివిల్ సర్వెంట్స్ స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్ఆర్‌డీ) డైరెక్టర్ జనరల్ టీపీ ఆచార్య సూచించారు. ఎంసీహెచ్ఆర్‌డీలో మంగళవారం నిర్వహించిన ఆల్ ఇండియా సర్వీసెస్ అండ్ సెంట్రల్ సర్వీసెస్ 92వ ఫౌండేషన్ కోర్స్ సందర్భంగా టీపీ ఆచార్య మాట్లాడారు. మెట్రోరైలులో ఎదురైన సవాళ్లు, పరిష్కరించిన తీరు, విజయవంతమయ్యేలా చేసిన కృషిని ప్రతీ ఒక్క అధికారి పరిశీలించాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన సివిల్ సర్వెంట్లను ఉద్దేశించి 'బీ ఏ పయనీర్, మేక్ ఏ డిఫరెన్స్, హైదరాబాద్ పీపీపీ ఎగ్జాంపుల్' అనే అంశంపై మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచలోనే అతిపెద్ద పీపీపీ ప్రాజెక్టుగా 72 కిలోమీటర్ల హైదరాబాద్ మెట్రోరైలని ఆయన అభిప్రాయపడ్డారు. సాంకేతికంగా కూడా ఇది అత్యంత ఉన్నతమైన ప్రాజెక్టని అన్నారు. ప్రారంభించిన ఐదవ సంవత్సరం నాటికి ప్రాజెక్టు బ్రేక్‌ఈవెన్‌కు చేరుకుంటుందని, ఆరవ సంవత్సరం నుంచి లాభాలబాట పడుతుందని అన్నారు. 45శాతం ఆదాయం ప్యాసింజర్ ప్రయాణ చార్జీల ద్వారా, మరో 45శాతం ప్రాపర్టీ డెవలప్‌మెంట్ ద్వారా, మిగతా 5శాతం అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా వస్తుందని అన్నారు. మెట్రోరైలు విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించారని అన్నారు.